ఎల్లమ్మ సన్నిధిలో.. డిప్యూటీ సీఎం సతీమణి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ఆదివారం ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆమె దేవాలయంలోని అద్దాల మండపాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని, మండప దాత బండారు సుబ్బారావును అభినందించారు. దేవాలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ ఆమెకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి మాజీ సభ్యుడు సింగారపు శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ చైతన్యకు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఎన్. కృష్ణ చైతన్య డాక్టరేట్ సాధించారు. ఎంజీఐటీ ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి పర్యవేక్షణలో 'రియూజబుల్ కాంపొనెంట్ రిట్రీవల్ ఫ్రం ఆప్టిమైజ్డ్ రిపాజిటరీ యూజింగ్ న్యూరల్ నెట్‌వర్క్స్' అనే అంశంపై పరిశోధన చేసి కృష్ణ చైతన్య సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగారం గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య ప్రస్తుతం బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : శ్రీ వల్లభ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అమీర్‌పేట్‌లోని జీహెచ్ఎంసీ మైదానంలో వైభవంగా నిర్వహించారు. అమీర్‌పేట్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను సన్మానించారు. సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు, నిర్వాహకులు సింగారపు శ్రీనివాస్‌గుప్తా, ప్రవీణ్, బాలాజీ, కటకం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో ఆర్యవైశ్యులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న తలసానికి ఆశీస్సులందజేస్తున్న అర్చకులు

సంత వ్యాపారులు జెక్‌కాలనీలోకి రాకుండా చర్యలు

ట్రాఫిక్ అదనపు సీపీ సి. వేణుగోపాల్‌రెడ్డి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : జెక్‌కాలనీ నివాసితులకు సమస్యాత్మకంగా మారిన ఆదివారపు సంత. ఎర్రగడ్డ సంతలో మేకలు, కోళ్ల అమ్మకాలకు సంబంధించి ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని సైబరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేశ్‌లతో కలిసి జెక్‌కాలనీలో అంగడి ప్రభావిత రోడ్లను కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కోర్టులు, మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వుల మేరకు సైబరాబాద్ కమిషనర్ ఆదేశాలతో సంతలోని వ్యాపారులు జెక్‌కాలనీ వీధుల్లోకి రాకుండా కాలనీ వాసులతో కలిసి కట్టడి చేసినట్లు తెలిపారు. జెక్‌కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, డీఆర్ఎస్ చందు, ప్రతినిధులు చింతిరెడ్డి అనంతరెడ్డి, విశ్వనాథరాజు, కంజర్ల సదాశివయాదవ్, వెంకట్ సోమ, పుర్మాని మల్లారెడ్డి, నాగిరెడ్డి, రాజా, లక్ష్మారెడ్డి తదితరులు డీసీపీతో సమావేశమై కాలనీ సమస్యలను వివరించారు.

కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులతో అదనపు డీసీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి

'ఖేలో ఇండియా క్విట్ ఇండియా'



క్రీడకారులకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న మల్క కొమురయ్య తదితరులు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 4: ప్రధాన మంత్రి నేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'ఖేలో ఇండియా క్విట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు కుత్బుల్లాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్స్‌ను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం మహేంద్రాహిల్స్‌లోని కార్యాలయంలో విజేతలకు రూ.50 వేలతో పాటు ట్రోఫీని, ప్రశంస పత్రాలను ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మోడల్ విద్యా సంస్థల చైర్మన్, బీజేపీ నాయకుడు మల్క కొమురయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని ఆదేశాల మేరకు మల్కాజిగిరి పార్లమెంట్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ 23 బస్తీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంక్షేమ సంఘం నాయకులు, బస్తీల నాయకులు ఆదివారం గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా బస్తీలలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను గుర్తించాలన్నారు.

నేడు .. ప్రజావాణి

సికింద్రాబాద్, ఫిబ్రవరి4: సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో నేడు(సోమవారం) ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ సుధాంష్ ఆదివారం వారిద్దరు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పదిన్నరకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పవర్‌బోర్ పనులు ప్రారంభం

పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

బొల్లారం, ఫిబ్రవరి 4: కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని గన్‌బజార్‌లో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆదివారం పవర్‌బోర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో నీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే లాస్య నందిత పవర్‌బోర్ పనులను ప్రారంభించేందుకు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవులపల్లి శ్రీనివాస్, కుమార్, ఫయీమ్, వాహబ్, జీలాని, నరసింహ, పాషా, షఫీ, రిజ్వాన్, మజార్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తులు అందజేత

పద్మారావునగర్ స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, అనాథలకు దుస్తులను అందజేసిన స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై. సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ. పావని తదితరులు. – బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 4

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 4: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వద్ద దొరికిన ఫోన్ నంబర్ ఆధారంగా మృతుడి పేరు మోహిత్, గుంటూరు జిల్లా, రేపల్లె ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడు కొంత కాలంగా కేపీహెచ్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ నేర్చుకుంటున్నట్లు సమాచారం. మృతుడి వయసు సూమారు 30 సంవత్సరాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

గోల్నాక, ఫిబ్రవరి 4: క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ సీఈ కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ బ్యాడ్మింటన్ కోర్టు పనులను స్థానిక క్రీడాకారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే పనులు పూర్తి చేసి క్రీడాకారులకు బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం పలువురు క్రీడాకారులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. చంద్రమోహన్, కరణ్‌రావు, సతీశ్‌రావు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ రిజర్వేషన్లు 50శాతానికి పెంచాలి

మంత్రి వెంకట్‌రెడ్డిని కోరిన బీసీ సంఘాలు

గోల్నాక, ఫిబ్రవరి 4 : పంచాయతీరాజ్ శాఖలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ వాటాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50శాతం రిజర్వేషన్లు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం సచివాలయంలో ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాం లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 22 శాతానికి తగ్గించారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణయ్య, భరత్, నీల వెంకటేశ్, సత్యం, రాజేందర్, రామకృష్ణ, జయంతి, బలరామ్, శివ, అరవింద్, రాకేశ్, జ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ హోదా కల్పించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 : ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా హోదా కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆరోగ్య మిత్రల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ అరోగ్య మిత్రల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. సంఘం అధ్యక్షుడు గిరి యాదయ్య మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలకు రూ. 35 వేల వేతనంతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక అధ్యక్షురాలిగా కరుణశ్రీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ బీసీ ఐక్యవేదిక మహిళా అధ్యక్షురాలిగా కొంగ కరుణశ్రీ నియమితులయ్యారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన మహిళా సంఘాల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఈ మేరకు ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ మహిళలకు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, ఆ దిశగా మహిళలు సంఘటితమై పోరాడాలన్నారు. జనాభా ధా మాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్న కేంద్రంపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. స మావేశంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, రాజేందర్, వెంకటేశ్, నిరంజన్, బాలయ్య, నిఖిల్, రేణు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్ గోషాల వద్ద నవ భారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్స్ హరినారాయణ, మహేంద్రకుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పేదలకు దుప్పలు, రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యను ముందుగా గ్రహించడమే క్యాన్సర్ నివారణకు సులువైన మార్గమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తతో వ్యవహరించాన్నారు. కార్యక్రమంలో సీహెచ్ గోపాలకృష్ణ, జగన్నాథం, బి.వినయ్, స్వరూపారాణి, పద్మాకమలాకర్, కృష్ణవేణి, లింగయ్య, సరోజిని, వనిత, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర్లు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లాలాపేట కుమ్మర సంఘం ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: కుమ్మర్లు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు పొందాలంటే అందరూ ఐక్యంగా ఉండాలని లాలాపేట కుమ్మర సహకార సంఘం అధ్యక్షుడు ఉప్పలంచి రామకృష్ణ సూచించారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌తో కలిసి రామకృష్ణ మాట్లాడుతూ.. కుమ్మర్లు నేటికీ అభివృద్ధి చెందలేదని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కుమ్మర్లందరికీ చేరేలా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పలంచి నాగయ్య, సలహాదారు కుందన్‌పల్లి వెంకటేశ్, సహాయ కార్యదర్శి దాసరం మోహన్‌కుమార్, కోశాధికారి రాజశేఖర్, ప్రతినిధులు దేవరుప్పల వెంకటేశ్, ఆంజనేయులు, మల్లికంటి వీరన్న, దుబ్బాక వెంకటేశ్, రాజరత్నం, ఖమ్మంపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి: మంత్రిపొన్నం

ఖైరతాబాద్, ఫ్రిబవరి 4: యువత సన్మార్గంలో నడవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నెక్లెస్ రోడ్‌లో జరిగింది. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో లీగ్ ట్రోఫీని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ క్రికెట్ పోటీల ద్వారా యువత తమ నైపుణ్యాన్ని నిరూపించుకునేందుకు దోహదపడుతుందన్నారు. మత్తును విడనాడాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి దోహపడుతాయని అన్నారు. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం నుంచి 40 నుంచి 50 జట్లు పాల్గొంటాయని, గెలుపొందిన టీమ్‌కు రూ.2 లక్షలు, రన్నరప్‌కు రూ.లక్ష బహుమతులు అందజేస్తామని తెలిపారు.

క్యాన్సర్‌ను ధైర్యంతో జయించొచ్చు

మణికొండ, ఫిబ్రవరి 4: క్యాన్సర్‌ను ధైర్యంతో జయించొచ్చని ఆంకాలజీ నిపుణులు డాక్టర్ విజయ్‌కరణ్ రెడ్డి అన్నారు. మణికొండ పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏరెట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్యాన్సర్ డే కావడంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌కరణ్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 16 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. క్యాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా జరుపుతున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణలో భాగంగా అందరూ కలిసికట్టుగా ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని తెలియజేశారు. అందులో భాగంగా 60 మంది మహిళల కోసం అత్యాధునిక యంత్ర పరికరాలతో కూడిన మొబైల్ వాహనంలో మెమోగ్రఫీ, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్ప మాట్లాడుతూ దైనందిన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత, 40 ఏండ్లు దాటిన ప్రతి మహిళ నిస్సంకోచంగా ముందుకు వచ్చి క్యాన్సర్ పరీక్షలు స్వచ్ఛందంగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డాక్టర్లకు, సీబీఓ వెంకట్‌ని పంచవటి కాలనీ సంక్షేమం సంఘం తరపున సీతారాం ధూళిపాళ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ గర్వించేలా బాధ్యతలు

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా వర్సిటీ గర్వించేలా నూతన బాధ్యతలు నిర్వర్తిస్తానని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. పూర్వ విద్యార్థులంతా ఓయూ అభివృద్ధి కోసం పని చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రసేనారెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పూర్వ విద్యార్థులు వర్సిటీని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని సూచించారు. తన వంతుగా ఓయూ పురోభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శ్యాంమోహన్, డాక్టర్ విజయ్ దేవరకొండ, ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఓయూ అధికారులు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4: ప్రధాని మోడీ నాయకత్వంలో రాబోయే రోజుల్లో అనేక విజయాలను సొంతం చేసుకోనున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఆదివారం 'మీట్ అండ్ గ్రీట్' పేరుతో కాలనీవాసులతో కేంద్రమంత్రి ముఖాముఖీ నిర్వహించారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆర్టికల్ 370 రద్దు, ఆయోధ్య రామ మందిరం, త్రిపుల్ తలాక్ లాంటి సమస్యల పరిష్కారానికి మోదీ ప్రభుత్వం తీసుకున్న చొరవే కారణమన్నారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు కాకుండా దేశ భవిష్యత్తు కోసం అనేక నిర్ణయాలను మోదీ ప్రభుత్వం తీసుకుందని, రాబోయే రోజుల్లో వాటి ఫలితాలు దేశాన్ని అగ్రస్థానంలో నిలపనున్నాయన్నారు. నగరంలో రవీంద్ర భారతి తరహాలో తమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైటెక్ సిటీ సమీపంలో సంగీత నాటక అకాడమీ పేరుతో దక్షిణాది రాష్ట్రానికి చెందిన భారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంగణంలో రూ.26 కోట్లతో ఘంటసాల వెంకటేశ్వరరావు ఆడిటోరియం నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలనీ క్లబ్ అధ్యక్షుడు వైవై రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజ మహేందరెడ్డితో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై హర్షం



బీకేగూడలో స్వీట్లు పంచుతున్న లింగంపల్లి నర్సింగ్‌రావు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : బీజేపీ అగ్రనాయకుడు ఎల్.కె. అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై బీజేపీ శ్రేణులు సనత్‌నగర్, అమీర్‌పేట్‌లలో స్వీట్లు పంచారు. బీజేపీ సికింద్రాబాద్ (మహంకాళి) జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకుల మహేశ్ ఆధ్వర్యంలో బీకేగూడ జయభారతి స్కూల్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ నాయకుడు లింగంపల్లి నర్సింగ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై స్వీట్లు పంచారు. ఎల్‌కే అద్వానీకి దేశంలోని అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం ఎంతైనా సముచితమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హృషికేశవ (ఉమ), సుమన్, శివ, రమేశ్, లక్ష్మణ్, నాగార్జున, ప్రియ తదితరులు పాల్గొన్నారు.